# మూడో వ్యక్తి

రామదుర్గం అదే పేరుతో వ్యవహరింపబడుతున్న జిల్లాకు ముఖ్య పట్టణం రాష్ట్ర ముఖ్య నగరానికి వెళ్ళే ట్రంకు రోడ్డు ఆ పట్టణం మీదుగా వెళుతుంది. పట్టణం శివార్లలో చెదురుమదురుగా కోటగోడలు, పైకప్పు కూలిపోయిన రాతికట్టడాలు, భూపతనమైన శిలాస్తంభాలు, బిచ్చగాళ్ళ కిరవుగా మారిన మంటపాలు మొదలైన ప్రాచీన శిథిలాలు దండిగా వున్నాయి. ఆ పట్టణం పూర్వం కర్ణాటక నవాబుల ఏలుబడి క్రింద వుండేదనీ, అక్కడ కోటలో ఒక పాళెగాడు నివసించేవాడనీ చెబుతారు. ఆ విధంగా చారిత్రిక ప్రశస్తి మాత్రమేగాదు, రామదుర్గం జిల్లాకు భౌగోళిక ప్రాముఖ్యత కూడా ఉంది. మిగిలిన జిల్లాలను బాధించినట్టుగా అతివృష్టిగానీ, అనావృష్టిగానీ రామదుర్గం జిల్లాను బాధించవు. జిల్లా అంతటా సమతల ప్రదేశాలకన్నా మిట్టపల్లాల మెట్ట భూములే హెచ్చు. కొండలపైన ఏ మాత్రం వానకురిసినా బుడుంగున నిండిపోయి మరవలు వెళ్ళే చెరువుల క్రింద మెట్టభూముల్లోకూడా పల్లపు సాగు కొనసాగే సదుపాయం కద్దు! అడ్డదిడ్డంగా క్రమ్ముకున్న పచ్చటి కొండలు, అక్కడినుంచి కొంతదూరానికి విసిరివేయబడినట్టున్న గుట్టలు, వాటిమధ్య పరుగెడుతున్న వాగులకడ్డంగా చిన్నవీ పెద్దవీ అయిన కుంటలు, చెరువులు, వాటి క్రింద కొన్ని వందల ఎకరాల విస్తీర్ణం మేరకు పచ్చని పంటభూములు, ఆ పరిసరాల్లో పల్లెలు ఇదీ స్థూలంగా రామదుర్గం జిల్లా భౌతికస్వరూపం.

ప్రకృతిలో నిమ్నోన్నతాలలాగా మనుషుల్లో మంచిచెడ్డలు తప్పనిసరి. రామదుర్గం ప్రజల స్వభావంలో చెడుపాలు చాలా తక్కువ. సున్నితంగా మాట్లాడ్డం వాళ్ల చేతగాని మాట నిజమే! కానీ వాళ్ళ మాటలెంత కటువో మనసంత మృదువు. రామదుర్గం జిల్లాలో తాటిచెట్లు హెచ్చు. ఆ జిల్లాలోని జానపదులుగూడా నైజాన్ని బట్టి చూస్తే తాడిచెట్లవంటి మనుషులు. ఎండనక, వాననక, చెమటోడ్చి పనిచేయడం మాత్రమే వాళ్ళకు తెలుసు. తాము పడుతున్న శ్రమతో, తాము పండిస్తున్న పంటతో లోకోద్ధరణ జరుగుతోందని డాబులు చెప్పుకోడం వాళ్ళకు తెలియదు.

రిప్‌వాన్ వింకిల్‌లాంటి చిరకాల నిద్రితుడెవడైనా పాతికేళ్ళ కాలాన్ని నిద్రలోగడిపి, యిప్పుడున్నట్టుండిలేచి రామదుర్గాన్ని కలయపరికిస్తే ఆశ్చర్యపడకుండా వుండడం సాధ్యం కాదు. అప్పుడిలా వీధులు జనసమ్మర్థంతో కిటకిటలాడేవి గాదు. సందు సందుకూ బంకులు వీధివీధికి హెూటళ్ళు, పేటపేటకూ సినిమాలు ఆనాడు లేవు. స్తబ్ధమై పడివున్న నాగరికతలో కదలిక బయల్దేరినందుకు గుర్తుగా ఆ రోజుల్లో బస్సులు, లారీలు అరుదుగా కనిపించేవి. ఈనాడవి ఒక అరగంటపాటు కనిపించకపోతే జీవితమే స్తంభించిపోయే పరిస్థితులేర్పడ్డాయి. జోగుతూ పడుకున్న కాలపురుషుడు ఒళ్ళు విరచుకుంటూ పైకిలేచి, లేవగానే పరుగెత్తడం మొదలెట్టాడు. మనుషులతనితో పరుగుపందానికి తలపడ్డారు. అంగళ్ళ నిండా జనం. హెూటళ్ళలో రద్దీ, సినిమా దగ్గర క్యూ, బస్సుల్లో ఓవర్‌లోడ్ – ఒక్క మాటలో చెప్పాలంటే ఈనాడు రామదుర్గం రామదుర్గం కాదు. నిర్విరామదుర్గం.

యూనివర్సిటీ పరీక్షలు ముగిసిన తర్వాత పెట్టెలూ, పరుపులూ సర్దుకుని రామన్న, సీనప్పలు రైలెక్కి రామదుర్గం చేరుకునే సరికి ఆ పట్టణం ఎలా వుంది?

రోడ్లు యధాతథంగా భూమిపైనే పరుగెడుతున్నాయి. ఇండ్లుకూడా నిశ్చలంగా భూమిపైనే నిలచివున్నాయి. ఖరాబైపోయినదల్లా అన్నెం, పున్నెం ఎరుగని గోడలు! ప్రతిగోడకూ రెండు నోళ్ళు, ఒకనోటితో మీ ఓటును గంట గుర్తుకే వేయమని ఆదేశం! మరోనోటితో అదే ఓటును సైకిలు గుర్తుకు ఎందుకు వేయరాదని సందేశం!

"పరీక్షలయిపోయాయట్రా రామం? ప్రశ్నించాడు భీమన్న.

"అయిపోయాయి నాన్నా! బాగానే వ్రాశాను. క్లాసు రావచ్చు. సీనప్పగూడా బాగానే వ్రాశాడు..."

"ఒకరి సంగతి నీకెందుకురా రామం! నేను చెబుతున్నానుగా! నువ్వు వినాలి మరి! ఆ సీనప్పను నువ్వికపైన నూనె వ్యాపారస్తుల సంఘంలోనైనా కలుసుకోలేవు. ఎందుకంటే వాళ్ళకొకటిగా, మనకొకటిగా యిప్పుడు వేర్వేరు సంఘాలున్నాయి."

హతాశుడైపోయిన రామన్న తండ్రి వైపు అయోమయంగా చూస్తూ, ఏదో చెప్పబోయి నోటమాటరాక వూరుకున్నాడు.

ఎంతగా మనస్కరించకపోయినా మరునాటి ఉదయం మండీలవైపు బయల్దేరాడు రామన్న. పూలదండ మినహాగా సర్వసన్నద్ధంగా వున్న పెద్ద గుమాస్తా అతనికి సింహద్వారం దగ్గరే ఎదురయ్యాడు.

"రండి రండి చినబాబుగారూ! మీరొస్తారని పెదబాబుగారు నాలుగురోజులప్పుడే చెప్పారు. మేము వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నాం. ఇదిగో, ఇదే తమ సీటు, కాఫీ పుచ్చుకుంటారా బాబూ?"

"వద్దు, పుచ్చుకునే వచ్చాను" అన్నాడు రామన్న, కాసేపు మౌనంగా వుండి ఏదైనా మాట్లాడకపోతే బాగుండదన్న ఊహతో 'ఈరోజు నువ్వుల నూనె రేటెంత?" అన్నాడు.

"నిన్నటి రేటు నూట నలభై రెండు రూపాయలండీ! ఈనాటి రేటింకా తేలలేదు."

"అలాగా! ఎప్పుడు తేలుతుందది?"

"ఏముందీ! రామప్ప మండీలో రేటు తెలుసుకోడం, మనం అంతకన్నా ఒక రూపాయి తగ్గించడం..."

"రేటు తగ్గించడంలో వాళ్ళుగూడా మనతో పోటీపడితే?"

పెద్ద గుమాస్తా ఫక్కున నవ్వేశాడు. రేటు తగ్గినకొద్దీ సరుకులో కల్తీ పెరుగుతుందండీ చినబాబుగారూ! అదే వ్యాపారంలో వున్న కిటుకు. ఆ రామప్పకు నూనె వ్యాపారంలో ఓనమాలు నేర్పించింది మనం. మరి, మనకు నామాలు పెట్టడం అతడి తరమా? మీకెందుకూ, మీరూరుకోండి. అన్ని విషయాలూ నేను చూసుకుంటానుగా..."

"ఏడ్చినట్టే వుంది. నువ్వూ, నీవ్యాపారమూ" స్వగతంగా అనుకున్నాడు రామన్న.

మండీలో ఒకటే నూనెజిడ్డు వాసన. అక్కడి మనుషుల ధోరణి మరీ దుర్భరంగా వుంది. తమ వ్యాపారం తమ లాభం కోసమేనన్న వ్యాపార దృష్టిగూడా వీళ్ళల్లో లుప్తమైపోయింది. తమ వ్యాపారం ఎదుటివారిపైన దెబ్బతీయడానికేనన్న కక్షమాత్రం బాగా బలిసింది. ఈ జాడ్యాన్ని బాగు చెయ్యడానికి మందులున్నాయో లేవో తెలియడంలేదు.

సినిమాల్లోలాగా ఓ చీటి వ్రాసిపెట్టి ఎక్కడికైనా పారిపోదామనుకున్నాడు రామన్న. కానీ అంతపనీ చేసేలోగా తన అభిప్రాయాన్ని కనీసం ఒక వ్యక్తితోనైనా పంచుకోడం అతనికి భావ్యమనిపించింది. కానీ రామదుర్గంలో ప్రస్తుతం నెలకొన్న విద్వేష పరిస్థితుల్లో తాను బాహాటంగా సీనప్పను కలుసుకునే అవకాశం లేదని అతడు గ్రహించాడు. అందుకనే ఓ ఉత్తరం వ్రాసి పోస్టు చేశాడు. రాయి బావిలో పడితే బుడగలైనా పైకొస్తాయి. తాను వ్రాసిన ఉత్తరానికి ఆ మాత్రం రెస్పాన్సు గూడా లేకపోయే సరికి రామన్నకు మతిపోయినంత పనయింది. సీనప్ప ఏమయ్యాడు? ఏం చేస్తున్నాడు? ఇంతకూ ఊళ్ళో వున్నట్టా లేనట్టా? ఏ ప్రశ్నకూ సమాధానం లభించడంలేదు. ఈలోగా అవాకులు చవాకులు కక్షలు కార్పణ్యాలు, కొట్లాటలు కేసులూ మొదలైన వాటిని గురించి ప్రతిరోజూ ధారావాహినిగా వార్తలందుతున్నాయి.

రామన్న బుర్రలో హఠాత్తుగా యింకొక సందేహం పొడసూపింది. అన్నలకూ అప్పలకూ మధ్య పచ్చగడ్డి వేసినా భగ్గున మండుతున్నదాయె! ఎంతటి వ్యక్తి అయినా పరిస్థితుల ప్రాబల్యానికి లొంగక తప్పదంటారు. కొంపదీసి సీనప్ప తనపట్ల వైరభావం పాటించడం లేదుగదా?

తలుపులు, కిటికీలు మూసి గదిలోపల ముంతపొగపెట్టినట్టున్న ఆ విపరీత వాతావరణంలో రామన్న ఊపిరి త్రిప్పుకోలేకపోతున్నాడు.

పది పదిహేను రోజులలాగే గడచిపోయాయి.

ఒకనాటి మధ్యాహ్నం నిద్రపోయి లేచిన రామన్న టేబిలుపైన తన పేరిటినొక కవరు కనిపించేసరికి ఆశ్చర్యచకితుడైపోయాడు. కవరులో నుంచి జాబును పైకి తీస్తుండగా అతడి చేతి వ్రేళ్ళు కంపించాయి. అది సీనప్ప వ్రాసిన ఉత్తరమే!

"డియర్ రామన్నా! పారిపోవడమే తప్పనిసరైతే ఆ పని చేయవలసిన వాడివి నువ్వొక్కడివే గాదు. పరిష్కరించలేకపోతే మానె, సమస్యల్ని అర్థమైనా చేసుకోకపోతే ఇక మన చదువులెందుకు? సమాజం ఒక నూలు వుండలాంటి దనుకుంటే తెలిసో తెలియకో ఎక్కడో జరిగిన తప్పిదంవల్ల ఆ వుండలో ముడిపడుతోంది. ఆ ముడిని విప్పే ప్రయత్నం జరగడంలేదు సరిగదా, తోడుగా అలాంటి ముళ్ళు మరికొన్ని పడుతున్నాయి. ఇదంతా చిక్కుల్ని చిక్కులతో గుణించే లెక్కలా పరిణమించింది. నేను రామదుర్గంలో రైలు దిగినప్పటినుంచీ ఆలోచిస్తున్నాను. యుద్ధాలవల్ల లోకానికి వినాశనం సంభవిస్తుందని మనకు తెలుసు. కానీ ఆ వినాశనానికి సంబంధించినంత వరకూ మనం భయపడవలసింది పదాతి దళానికి చెందిన యుద్ధభటుణ్ణి చూచి గాదు. ఒక్క దెబ్బతో కొన్ని చదరపు మైళ్ళు భస్మీపటలం చేయగల మారణాస్త్రాలను కనిపెట్టే కుశాగ్రబుద్ధి ఎవడైతే వున్నాడో, వాణ్ణి చూచి. మన సమాజంలో నెలకొన్న సంక్షోభాన్ని గురించి యిప్పుడు నేను చూచాయగా చెబుతున్నాను. రామదుర్గంలో యిప్పుడు రెండు పత్రికలున్నాయి. పత్రికల్లో ప్రచురింపబడే విషయాలకు మల్లే వీటి పేర్లుగూడా విలక్షణమైనవే! ఒకటి 'భజావోధంకా' ఇంకొకటి 'గణగణగంట'. ధనాపేక్షతోగాని, సేవాభిలాషతోగాని యివి నడపబడడంలేదు. ఆత్మరక్షణ గావించుకుంటూ ఎదుటి వారి పైన దెబ్బతీయడం యుద్ధనీతి గదూ! ఈ పత్రికల

విధానంగూడా అదే! ఆత్మరక్షణకు బదులుగా యివి ఆత్మస్తుతి గావించుకుంటాయి. పరుషవాక్కులతో ఎదుటివాళ్ళ మనసుల్ని గాయపరుస్తాయి. మెదడుకు మేతవేసే మాట దేవుడెరుగు, యివి కలహానికి ఎడతెగని యింధనాన్ని సమకూరుస్తాయి. ఈవారం ఒక పత్రిక ఒకానొక ప్రత్యేక వ్యక్తిని కలియుగ రావణాసురుణ్ణిగా చిత్రిస్తే, పైవారం రెండో పత్రిక యింకొక ప్రత్యేక వ్యక్తిని అభినవ బకాసురుణ్ణిగా వర్ణిస్తుంది. పోనీ, ఈ బ్రతికున్న మానవులు తమ కార్పణ్యాలతో తాము సతమతమై పోవచ్చుగదా రామం! ఊహూ, ఆ మాత్రంతో తృప్తి పడడంలేదు. చనిపోయిన వాళ్ళనుగూడా రంగంలోకి తెస్తున్నారు. దేశంతో, కాలంతో నిమిత్తం లేకుండా ప్రతిదేశంలోనూ, ప్రతి కాలంలోనూ కొందరు దుర్మార్గులుంటారు. ఈ ప్రాంతంలో మల్లెకోన సిద్ధప్ప అన్న పేరుతో ఓ దుర్మార్గుడుండేవాడు. వాడికెందుకో గొల్లలపైన కోపం వచ్చింది. అమాంతంగా గొల్లపల్లెలో వున్న మేకల మందలన్నింటిని తోలుకొచ్చి ఒక రాత్రి రాత్రంతా అడుసు ముళ్ళల్లో నిలబెట్టి వుంచాడు. తెల్లవారేసరికి మేకల్లో సగానికి సగం బిర్రబిగుసుకుపోయి తలలు వాల్చేశాయి. ఇది నూరేళ్ళ క్రిందటి కథ. 3 నెలల క్రిందట యిది మరిన్ని చిలవలతో పలవలతో గణ గణగంటలో ప్రత్యక్షమయింది. అప్పటికి నేను మాత్రం నెల తక్కువగా పుట్టానా ఏమిటి? అంటూ 'భజావోధంకా' 'కొంపలార్పిన కెంపన్న' అన్న పేరుతో ఓ సీరియలే ప్రారంభించింది. ఆ కెంపన్నగూడా నిన్న మొన్నటివాడు గాదు. మూడు తరాల క్రిందటి వాడు. ఇంతకూ నేను చెప్పొచ్చిందేమిటంటే ఎలాగూ మనమిక్కడ నుంచి వెళ్ళిపోదలచుకున్నాం. ఆలోగా ఒక మంచి చేయగలిగితే బాగుండునని నాకనిపించింది. రావణాసురుడి కాష్టం ఏ మాత్రం చల్లారినా చల్లారినట్టే! మనం ఈ పత్రికలు ఆగిపోయేటట్టుగా ఏమైనా చేయలేమా! అని నేను గడచిన పదిహేను రోజులుగా ఆలోచిస్తున్నాను. అదేపనిగా పాత సంచికలన్నీ సంపాదించి నేను రెండు పత్రికల్నీ గాలించేశాను. బావి త్రవ్వితే భూతం ఒకటి పైకొచ్చిందంటారు గదా! ఆ సామెత నా పరిశీలనపట్ల సార్థకంగా పరిణమించింది. ఒకానొక అంచనాపైన నేను తుపాకిని చిమ్మ చీకటిలోకి గురిపెడుతున్నాను. నా ఊహ సరైన మార్గంలోనే గనుక పయనిస్తున్నట్లయితే గురితప్పి పోగూడదు. ఇప్పటి కింతకంటే చెప్పలేను. రేపు సాయంకాలం ఏడు గంటలకు సంతపేట చివర రైల్వే గేటు దగ్గర నీకోసం వేచి వుంటాను..." రామన్న కొుక్షణం తన మిత్రుడు ఉన్మాదానికి అభిముఖంగా పరుగిడుతున్నాడేమోననిపించింది. కాకపోతే తుపాకీ ఏమిటి? గురిపెట్టడమేమిటి? మిత్రుడి ఆలోచనా ధోరణిగానీ, పరిశీలనా శక్తిగానీ అతనికి ఉత్సాహం కలిగించలేకపోయాయి.

కానీ మరునాటి సాయంకాలం సంతపేట చివర రైల్వే గేటు దగ్గర రామన్నకోసం ఎదురు తెన్నులు చూస్తున్న సీనప్ప తరహా మాత్రం యిందుకు విరుద్ధంగా వుంది. తలకొక టోపీ పెట్టుకుని ముఖం సరిగ్గా కనిపించకుండా చెవులపై నుంచి పెదవుల కడ్డంగా మఫ్లర్ చుట్టుకుని, వేపచెట్టు క్రీనీడలో నిల్చున్న సీనప్ప కనిపించగానే రామన్న అన్నాడు. "ఏమిత్రా సీనూ! నీకెందుకో ఆకాశానికీ మూడు బారలన్నంత ఉత్సాహంగా వుంది. కానీ ఎంత ఉత్సాహంగా ఉన్నా నువ్వు షెర్లాక్ హోమ్స్, హెర్క్యుల్ పాయిరైట్, పెర్రీమానస్‌లవంటి జగద్విఖ్యాత డిటెక్టివ్‌లకుమల్లే యిలా పోజులు పెట్టటం మాత్రం

బాగుండలేదు. మహావీరులను అనుకరించబోయి నవ్వుల పాలైన డాన్ క్విక్ సాట్ కథ నీకు తెలియంది కాదు..."

"నువ్వు పుస్తకాలు చదివినంత జాగ్రత్తగా లోకాన్ని పరిశీలించవురా రామం!" చెంపపెట్టులా అడ్డుతగిలాడు సీనప్ప. "అదే పనిగా నేను మన స్థానిక పత్రికల్ని పరిశీలించానని వ్రాశాను గదా! రచనల ద్వారా ఈ రచయితల చదువును గురించి, సంస్కారాన్ని గురించి ఓ నిర్ణయానికి రావాలన్న కుతూహలం కలిగింది నాకు. శైలిని బట్టి రచయిత వ్యక్తిత్వాన్ని అంచనా కట్టవచ్చునని పెద్దలు చెప్పనే చెప్పారు. నాకు సాధ్యమైనంతలో వీలైనన్ని భజావోఢంకాలను, గణగణ గంటలను సేకరించాను. వరుసగా నాలుగు రాత్రులు వాటిని పరిశీలిస్తూ కూర్చున్నాను. రెండు పత్రికల తాలూకు సంచికల్ని చదవగా చదవగా నా తల దిమ్మెక్కిపోయింది. మెదడు చైతన్యం లేని బంకమట్టి ముద్దలా తయారైంది. భజావోఢంకా, గణగణ గంటల్లో చేతిలో ఉన్న పత్రికేదో తెలియరానంతగా బుద్ధి స్తంభించిపోయింది. కళ్ళు మూసుకుని అలాగే వాలుకుర్చీలో పడుకున్నాను. బుర్రలో హఠాత్తుగా మెరుపులాంటి ఊహ మెరిసింది. ఈ రెండు పత్రికలూ ఒక్కలాగే ఉన్నాయన్న ఊహ నాకు అకారణంగా కలిగింది కాదు. రెండింటిలోనూ ఒకటే రకమైన పలుకుబళ్ళు ఒకటే రకమైన నానుడులు ఒకటే విధమైన వాక్యవిన్యాసాలు తరచుగా కనిపిస్తున్నాయి. ఎలా సంభవమైందిది? చెప్పనా రామం! పట్టణంలో రెండు పత్రికలున్నాయి గదూ! రెండింటికీ రచనలు సరఫరా చేస్తున్న రచయితలు ఇద్దరు కారు. ఒక్కడు!..."

ఆశ్చర్యాతిరేకంతో రామన్న నోరు తెరిచేశాడు.

"మనిషైతే తన రూపానికి వెయ్యి బురకాలు తగిలించుకోవచ్చు. కుడిచేతిలో ఒక కలం. ఎడమ చేతిలో ఒక కలం పట్టుకుని దస్తూరిలోకూడా మార్పు సాధించవచ్చు. కానీ శైలిలో అలాంటి తిరకాసులు చెల్లవు. ఆ ఎత్తుగడలు, ఆ విరుపులు, ఆ నుడికారాలు రచయితలను దాచిపెట్టవు. అంటే మనం వట్టి థియరీపైన్నే యింతదూరం సాగి వచ్చామన్న మాట! ఇకపైన ముఖాముఖిగా వ్యక్తినే కలుసుకోబోతున్నాం."

రామన్న తన చెవుల్ని తానే నమ్మలేకపోయాడు. "ఎలా తెలిసింది నీకు? ఎక్కడుంటాడతను?"

సీనప్ప పెదవులపైన సన్నగా ఓ దరహాసం మెరిసింది.

"వినే వాడికి చెప్పేవాడు లోకువరా రామం! ఈ రహస్యాన్వేషణలో నేనెన్ని రాత్రులు మేలుకున్నానో, ఎన్నెన్ని చోట్ల పొంచిపొంచి మాటు వేశానో నీకేం తెలుసు?" భుజం క్రింద చేయి వేసి మిత్రుణ్ణి పైకి లేవదీశాడు సీనప్ప. చీకటిలో ఇద్దరూ రైలుకట్టవెంబడి నడవసాగారు. "ఇలాగే ఒక ఫర్లాంగు దూరం నడిస్తే మనకు కొన్ని మట్టి మిద్దెలు కనిపిస్తాయి. ఈవలా ఆవలా వీధులుంటాయి. మధ్యలో మట్టిమిద్దెలు. ఇంటికి ముంగలి ఏదో, పెరడేదో తెలుసుకోవడానికి వీల్లేకుండా వుండడం మట్టి మిద్దెల ప్రత్యేక లక్షణం. ఇప్పుడు మనం ప్రవేశించబోతున్న యిల్లుగూడ యిందుకు మినహాయింపుగాదు. కానైతే యిదివరకూ ఒక గుమ్మంలోనుంచి అప్పులు, యింకొక గుమ్మంలోనుంచి అన్నలు ప్రవేశించేవారు. మొదటిసారిగా మర్యాదాతిక్రమణం మన మూలంగానే జరగబోతున్నది."

లోకానికింకా గంట తొమ్మిది కాలేదు. సంతపేట కప్పుడే అర్ధరాత్రి కావచ్చినట్టుంది. మట్టి వీధులు నిర్మానుష్యంగా పడివున్నాయి. వీధిదీపాలు గుడ్డిగా కునికిపాట్లు పడుతున్నాయి. ఆ నీరవ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఓ చప్పుడు, తలుపు తట్టిన చప్పుడు.

మెల్లగా తలుపు తెరుచుకుంది. ద్వారం గుండా వెలుపలికి ప్రసరిస్తున్న కాంతి ఆగంతకుల ఆకారాలను స్పష్టంగా ప్రదర్శించేపాటి కాంతిమంతంగాలేదు.

కొత్త ముఖాలు కనిపించగానే అవతలి వ్యక్తి ఒకటి రెండడుగులు వెనక్కు వేశాడు.

"ఎవరండీ? ఎవరికోసం?" మాటలో తొట్రుబాటు ద్యోతకమైంది.

సీనప్ప బదులు చెప్పాడు 'మీ పనికి అంతరాయం కలిగివుంటే మన్నించాలి! తప్పని పరిస్థితిలో యిలా చేయవలసి వచ్చింది."

"సూటిగా విషయమేమిటో చెబితే సరిపోదూ?"

"చల్లకు వచ్చి ముంతను దాచుకునే వాళ్ళం కాము. కానీ మరీ అంత క్లుప్తంగా చెప్పడం సాధ్యం కాదు. గుమ్మంలో నిల్చుని ఎంతసేపని మాట్లాడుకోగలం! అనుమతిస్తే లోపలికి వచ్చి కూర్చుని మీ అమూల్యమైన కాలంలో ఓ అరగంటసేపు వాడుకోవాలన్న సదుద్దేశంగూడా వుంది మాకు..."

లాంఛనంగా అనుమతికోసం అర్థించడమేగాని అందుకోసం విధిగా వేచివుండాలన్న పట్టింపులేవీ పెట్టుకున్నట్టు లేదు సీనప్ప. ప్రక్కబలంగా మిత్రుడు వెన్నంటగా, అతడు ద్వారాన్ని దాటి నడవలో ప్రవేశించాడు. అక్కడి నుంచి హాల్లోకి వచ్చేశారు.

"అబ్బాయిలూ! మీ వాలకాలేమి బాగుండడం లేదు..."

వెనుక వైపు నుంచి కటువుగా హెచ్చరిక వినిపించింది "నేనిక్కడ ఒంటరిగా వున్నాననుకుంటే మీరు తీవ్రంగా పొరబడ్డారన్న మాటే! గొంతెత్తి పిలిస్తే, మరుక్షణంలో యిక్కడ యిరవైమంది హాజరు కాగలరు...."

"ఫోను సదుపాయముంటే మీరు హాయిగా పోలీసుల్నే పిలిపించుకోవచ్చు. మాకేమీ యిబ్బందిలేదు" సౌకర్యంగా ఫేము కుర్చీలో సర్దుకొని కూచుంటూ నింపాదిగా అన్నాడు సీనప్ప.

అవతలి వ్యక్తి రిచ్చపాటుకు లోనుగాక తప్పిందిగాదు.

ఆ అవకాశం మిత్రులకు చక్కగా ఉపకరించింది.

హాలు తాలూకు ద్వారబంధానికి ఆనుకొని నిశితంగా తమవైపు చూస్తూ నిల్చున్న వ్యక్తి వయస్సు ముప్ఫై దరిదాపుల్లో వుంటుంది. కంకాళ మాత్రమైన శరీరం అతనిది. పైకి లేచిన నుదురు, అగాధాల్లాంటి కళ్ళు, పిరమిడ్ లాంటి ముక్కు, సంస్కారాన్ని చవిచూడని శిరోజాలు ఆ ఆకృతికి విపరీతమైన వైచిత్రిని సమకూరుస్తున్నాయి. ఆ ఆకారం నడయాడుతున్న ఆవరణగూడా అందుకు తగ్గట్టుగానే అమరింది. వెల్తురుకు దుర్భేద్యంగా, భూగర్భ గృహానికి ఒక మంచి నమూనా లాగావున్న ఆ కట్టడంలో దోమలు విశృంఖలంగా రొదచేస్తున్నాయి. నల్లులు నిర్భయంగా గోడలపైన సంచరిస్తున్నాయి. గాలి కదలిక పోవడం ఒకటి. ఉన్న గాలిలో గూడా చెమ్మపాలు ఎక్కువగావడం ఒకటి. ఈ రెండు అవలక్షణాలు ఆ యింటినొక యిల్లుగా గాక అప్పుడే ఖాళీ చేసిన చన్నీటితొట్టిగా నిరూపిస్తున్నాయి.

సారంగంలాంటి ఆ యింట్లో జీవితం గడుపుతున్న విచిత్రవ్యక్తి ఉన్నట్లుండి ఓ నిర్ణయానికి వచ్చినట్టుగా ఒక్క విసురుతో వచ్చి కుర్చీలో కూలబడ్డాడు. "మాట్లాడాలనుకుంటున్నారు. దేన్ని గురించి?" అంటూ సూటిగా ప్రశ్నించాడు.

"అలాగన్నారు గనుక బాగుంది. చర్చనీయాంశం వ్యక్తిగత విషయాలను గురించిగాదు. ప్రస్తుతం ప్రజల్ని ఆకర్షిస్తున్న ప్రప్రథమ విషయం ఏదైతే వుందో, దాన్ని గురించి మాట్లాడుకోవాలని మా ఉద్దేశం..."

"అదేమిటని మీ అభిప్రాయం?"

"రాజకీయాలు కాదంటారా?"

"కావచ్చు."

"విపులీకరించాలంటే, కులంతో ముడిపడివున్న రాజకీయాలమూలంగా సమాజంలో చెలరేగుతున్న సంక్షోభాన్ని గురించి – అని చెప్పుకోవచ్చు. దాన్ని గురించి మనం మనసువిప్పి మాట్లాడుకోవాలి."

ఒక్కసారిగా ఎదురు తిరిగాడతను. "మనసువిప్పి మాట్లాడుకోవడానికి ఒకర్ని ఒకరు బాగా ఎరిగి వుండడం ముఖ్యం."

"అదెంత పని! చిటికెలో పరిచయాలు ముగించుకోవచ్చు. రాజకీయాలకు సంబంధించినంత వరకూ మేము వట్టి ఖాళీ పేపర్లలాంటి వాళ్ళం. అంటే నిరపాయకరమైన మనుషులం. పోగా మిమ్మల్ని గురించి మీ నోటంట మీరే చెప్పి తీరాలని గూడ మేము అడగడంలేదు. ఎందుకంటే మిమ్మల్ని గురించి మాకు బాగా తెలిసినట్టే లెక్క...!"

పేము కుర్చీలోనుంచి తేలు కుట్టినట్టుగా ఎదుటివ్యక్తి ఎగిరిపడ్డాడు.

"ఏం తెలుసు మీకు? ఏమిటి మీకు తెలిసింది?" ఆ మాటలు కారడవిలో దారిదప్పినవాడి ఆక్రందనలా ధ్వనించాయి.

"నిన్న మొన్నటివరకు మిమ్మల్ని గురించి కొద్దిమందికి మాత్రమే తెలుసు. స్వలాభం దృష్ట్యా వాళ్లు మీ ఉనికిని, వ్యక్తిత్వాన్ని రహస్యంగా పదిలపరచి వుంచారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. ఐనా చేయి దాటిపోలేదు..."

"మమ్మల్నిద్దర్నీ మీరు మీ శ్రేయోభిలాషులుగానే భావించవచ్చు..."

అతడి ముఖం వివర్ణం గావడానికి క్షణంలో సగంసేపు పట్టలేదు. ప్రశ్నగూడా నూతిలోనుంచి వెలువడిన శబ్దంలా నీరసంగా వుంది.

"ఎలా తెలిసింది మీకు?"

"తెలుసుకున్న దానితో పోల్చి చూస్తే అందుకోసం మేము పడిన శ్రమ ఏమంత చెప్పుకోదగ్గదికాదు..."

ఇక్కడ రామన్న ప్రసంగంలో స్వయంగా కలుగజేసుకున్నాడు.

"మేము న్యాయనిర్ణేతలం గాము. మాకున్న ధర్మాధర్మ విచక్షణాజ్ఞానంగూడా కొద్దిపాటిది. అయిదేళ్ళ పసివాడు దేవుడెలా వుంటాడు నాన్నా అని తండ్రిని ప్రశ్నిస్తాడు. అలాంటి కుతూహలం తప్పితే మాకు మరో దురుద్దేశం లేదు. మీరేం చేశారనైతే మాకు తెలుసు. ఎందుకు చేశారో తెలియదు. మేము కారణం తెలుసుకోగలిగితే చాలు."

విచిత్రవ్యక్తి తటాలున లేచి నిల్చున్నాడు.

"పారిపోవడం సాధ్యమేననుకుంటే మీరు తీవ్రంగా పొరబడ్డారన్నమాట!" ఈసారి హెచ్చరించే వంతు తన దైనట్టుగా అన్నాడు సీనప్ప.

కానీ పారిపోనుంకిస్తున్న సూచనలు అతడిలో కనిపించలేదు. మెల్లగా నడిచి వెళ్ళి అతడు వీధి తలుపు మూసి, లోపలినుంచీ గడియపెట్టాడు. తిరిగి వస్తూ హాల్లోకి తెరచుకుంటున్న తలుపుల్ని గూడా మూసేశాడు. నెమ్మదిగా కుర్చీలో కూర్చున్నాడు.

"చూడండి ఫ్రెండ్స్!" మరింత నెమ్మదిగా ప్రారంభించాడతను. "వెక్కిరించడానికి అలవాటుపడిన వాడు చిక్కి బిక్కరించక తప్పదని నాకు తెలుసు. ఎప్పుడో ఒకప్పుడు యిలాంటి పరిస్థితి నన్నెదుర్కొని తీరుతుందన్న అనుమానం అంతర్యంలో నా అంతరాత్మకు ఉండనే ఉంది. మీరు ఉన్నపళంగా లోపలికి వచ్చి తుపాకీ సంధించి 'హాండ్స్ అప్' అంటున్నారు. ఎట్టి మినహాయింపులూ లేకుండా మీకు నేను లొంగిపోతున్నాను..."

ఒక క్షణం నిశ్శబ్దం.

"ఇదివరకు నేను లేచి నిల్చునేసరికి పారిపోజూస్తున్నానని మీరు సందేహించారు. మీరలా సందేహించడం సబబుకాదని నేను చెప్పను. కానీ నా బోటివాడు లోకంలోకి పారిపోవడం సాధ్యంగాదు. ఎందుకంటే నేను లోకంనుంచి పారిపోయి వచ్చినవాణ్ణి..."

"ఎందుకూ?"

"బ్రతకలేక!"

"మీకున్న తెలివితేటలతో మీరు లోకంలో బ్రతకలేకపోయారంటే నమ్మడం కష్టం..."

"వట్టి తెలివితేటలేగావు" అతడు చరాలున బల్లలోనుంచి ఓ సొరుగును యీవలకి లాగాడు. ఓ కవరు బయటకు తీశాడు. అందులో వుండలా ముడుచుకుని పడివున్న ఓ కాగితాన్ని పైకి తీశాడు. "ఇది విశ్వవిద్యాలయంవారు నాకిచ్చిన యోగ్యతాపత్రం. ఇదెలా నలిగిపోయిందో మీరు చూస్తున్నారు. కానీ దీనితో ముడిపడివున్న నా జీవితం ఎన్ని నలుగుళ్ళపాలైందో, ఎన్ని రంపపు కోతలకు లోనైందో మీకు తెలియదు. బ్రతకడానికి కావలసినవి తెలివితేటలూ, విద్యావివేకాలూనని మీ అభిప్రాయం..."

"అవిగాకపోతే మరేమిటంటారు మీరు?"

"చెప్పమంటారా ఫ్రెండ్స్!" చువ్వలాలేచి నిల్చున్నాడతను.

"నేను అన్నను కాను. అప్పనుకాను. ఆ యోగ్యత నాకుంటే చదువు, తెలివితేటల్లాంటి మిగిలిన అర్హతలన్నీ నా కనవసరమై వుండేవి. జిల్లాలో ఓ మారుమూల కుగ్రామం మాది. మానాన్నగారి కిప్పుడు కళ్లు కనిపించవు. కళ్లు కనిపించిన రోజుల్లో ఆయన ఖామందుల మళ్ళను కౌలుకు చేసేవాడు. నాకు ముగ్గురు తమ్ముళ్ళు, ముగ్గురు చిన్నాన్నలు, వాళ్ళకు పన్నెండుగురు బిడ్డలు. ఈ యిరవై, ముప్పైమంది, అక్కడ ఎండవానలకోర్చి, ఎముకలు విరుచుకుంటే ఇప్పుడు మీ ఎదుట నిల్చున్న ఈ అభాగ్యుడు కాలేజీలో చదువుకోగలిగాడు. మావాడు కలెక్టరవుతాడు. జడిజీ అవుతాడన్న వాళ్ళ అజ్ఞానానికి ఈ లోకం బ్రహ్మరథం పట్టదన్న సత్యం వాళ్ళకు చాలా ఆలస్యంగా తెలిసింది. నేను కూర్చోని పరీక్షలేదు. తిరగని వూరులేదు. చూడని ఆఫీసరు లేదు. దర్శించుకోని

కార్యాలయంలేదు. ఉద్యోగం దొరకనివేసట ఒకవైపు. దుర్భరమైన దారిద్ర్యపరిస్థితు లొకవైపు. అయిదారేళ్ళు అలాగే గడిచిపోయాయి. ఎక్కడికెళ్ళినా చుక్కే ఎదురవుతూ వచ్చింది. చివరికీ ఊరొచ్చాను. గబ్బిలంలా ఈ వేషం ధరించాను. గబ్బిలానికి వెలుగంటే భయంగదూ! అవును. నాకూ వెలుగన్నా భయమే! అందుకే ఈ గుహలో జంతువులా జీవించాను. గ్రుడ్లగూబలా చీకటికి అలవాటు పడ్డాను. తోడేలులా కసితీర్చుకున్నాను. నా అంతట నేనుగా సృష్టించుకున్న ఈ వృత్తిలో ఆర్జన పుష్కలమైనకొద్దీ శాంతి నిష్పచ్చరం కావచ్చునని మాత్రం నేననుకోలేదు. ఆ వాస్తవం తెలిసివచ్చేసరికి నేను నేనుగా లేను. మరమ్మత్తులకు అతీతమైన స్థితిలో వున్నాను. కర్కోటకుడు – కాటువేసి నలుదు బాహుకుడుగా మారితే అందుకు శనేశ్వరుడే కారకుడని చెబుతుంది కథ. మరి నాలో వికృతాకారానికి, విపరీత వ్యక్తిత్వానికి కారకులెవరో చెప్పవలసింది మీరు...”

రెండు వారాలు గడచిపోయిన తర్వాత ఒకరోజు తెల్లవారేసరికి రామవరం రామన్నగానీ, చీనేపల్లి సీనప్పగానీ రామదుర్గంలో కనిపించటంలేదన్న వార్త ఒకటి గాలిలా వ్యాపించింది. రాత్రి రెండు జాములప్పుడు రామదుర్గం నుంచి బయలుదేరే రైలు బండిలో వాళ్ళెక్కుతుండగా చూచిన వాళ్ళొకరిద్దరు లేకపోలేదు. కానీ వారితోబాటుగా రైలెక్కిన మూడోవ్యక్తి ఎవరై ఉంటారన్నది మాత్రం ఒక చిదంబర రహస్యంగా ఉండిపోయింది.

♦ ***1962*** ♦